# వాడి తల్లి

రాముడికి ఒంట్లో కులాసాగా లేదు. ఏదో చెప్పలేని బాధ. ఎంత ఆదరణగా అడిగినా ఉంకడు. పలకడు. ఒళ్ళు కాలిపోతూంది. వాడినిచూస్తే కడుపు తరుక్కుపోతుంది. నోరు వాయలేని వెధవ. అమాయికుడు వీడికి తగినట్లు యజమాని ఏమాత్రం మానవత్వం లేని మొరటుమనిషి. తను, తన తమ్ముడు ఎంతగా కండలుకరగించివేస్తూంటే యజమాని ఎప్పా ఎకరాలకు ఎకరాలు కొంటున్నాడో చూస్తూనే ఉన్నాడు. మొన్నటికి మొన్న కరణంగారితో "ఏమిటోనండీ, వ్యవసాయం



లంక వెంకటరమణ

చెయ్యలేకపోతున్నాను'' అని అంటూంటే తనకు కడుపు రగులుకుపోయింది.

రాక్షసుడులాగా యజమాని వచ్చాడు. కర్కోటకుడు. తిడతాడు. కొడతాడు. తను భరించలేడు. వెంటనే లేచి నిలుచున్నాడు రాముడు. లక్ష్మడు పరధ్యానంగా పడుకుని నెమరువేస్తున్నాడు. యజమాని వస్తున్నట్లు గుర్తుగా గిట్టతో చిన్న తన్ను తన్నాడు. లక్ష్మడు కుర్రవెధవ. ఏమిటో పరధ్యాస. వాడు పెద్దకమతగాడి చేతిలో రోజూ తినే దెబ్బలకు హద్దు పద్దు లేదు. ఇక యజమాని సరేసరి.

ఛడేలున కొరడాతో కొట్టాడు. అదిరిపడి లేచాడు లక్ష్మడు. బెదురుగా కళ్ళు కదిలాయి. బాధగా మూలిగాడు. మూగగా అరిచాడు. ఆ బాధ, ఆ అరుపు తనకే తెలుసు. యజమాని వినలేదు. విన్నా అర్థం చేసుకుని సానుభూతి చూపలేని అమానుషత్వం ఆయనలో కరుడుకట్టింది.

''చూశావురా, అన్నయ్యా, ఎలా కొట్టాడో!'' ఏడుపు తొక్కిపట్టి జాలిగా అన్నాడు. నిజమే మరి. రెండు రోజులనించి తనకు, తన తమ్ముడికి జ్వరం వస్తున్నా ఆ బాధనుకూడా వ్యక్తంచెయ్యకుండా గొడ్డుచాకిరీ చేస్తున్నారు. ముఖ్యంగా తమ్ముడు లక్ష్మడు చేస్తున్నాడంటే ఓపిక ఉండికాదు. భయంచేతనే. చేస్తున్నాడు కదా, ఏం మాయరోగం అనుకుని ఇంకా చేయిస్తున్నాడు యజమాని.

తమ్ముడిని తలుచుకుంటే కడుపు తరుక్కుపోతుంది. వాడి దొక అమాయిక జన్మ. ఆరోజు తనకు బాగా గుర్తు. తమ్ముడిని కనేటప్పుడు అమ్మ అనుభవించిన పురిటి నొప్పులు కళ్ళకు కట్టినట్లుగా ఉన్నాయి ఇప్పటికీ. కన్నతల్లి మరణవేదన అనుభవిస్తున్నప్పుడు తనేమి చెయ్యలేకపోయాడు. కట్టేసిన కట్టుకొయ్యకు మొక్కుకున్నాడు. అమ్మను కాపాడమని మొరపెట్టుకున్నాడు.

''అ... మ్మా!'' బాధతో విలవిలలాడిపోతూ అమ్మ అరిచింది. కన్నీరు మున్నీరుగా ఏడిచాడు. తన గోడు ఎవరికి తెలుస్తుంది? పశువులు అనుకుంటారే తప్ప తమకు కూడా బాధలు గాథలు ఉన్నాయనుకోరుకదా ఈ మనుషులు!

''బతకలేనురా, రాముడూ!'' హృదయవిదారకంగా అన్నది అమ్మ. అందరు కంగారుపడుతున్నారు. అమ్మ అంత బాధపడుతూఉంటే నాన్న ఎందుకు రాలేదో అర్థం కాలేదు రాముడికి. చాలాసేపు నాన్నను కలవరించింది అమ్మ. నాన్నను తలుచుకుని ఏడుస్తూ ఉంటుంది కాని విముఖుడుగానే ఉండిపోయాడు. నాలుగైదుసార్లు బజారులో అగుపించాడు. అమ్మను చూడడానికి రమ్మని ఒకసారి ఎంతగానో బతిమాలాడు. కసిగా పొడిచి పంపాడు తండ్రి. అయినా ఊరుకోలేదు.

''నాన్నా! అమ్మ నీ కోసం...'' ఏడుస్తూ అన్నాడు. మానవత్వం లేని మనిషిలాగా వెళ్ళిపోయాడు.

ఇవాళ నమ్మకం ఉంది. తప్పకుండా నాన్న వస్తాడు. రాకపోతే తను పిలుచుకురావాలి. 'మరీ అంత అమానుషంగా మనుషులు ప్రవర్తించినట్లే తాముకూడా ప్రవర్తిస్తే ఎట్లా?' అనుకున్నాడు. కాని ఏం చెయ్యగలడు? కట్టుకొయ్యకు బందీ.

అంతలో పెద్దకమతగాడు వచ్చాడు. కట్టుకొయ్యకు ఉన్న కట్లు ఊడదీస్తున్నాడు. ఇదే మంచి సమయం అనుకున్నాడు. చేసే సాహసం ఎంతవరకు సఫలం అవుతుందో తెలియదు. రాముడికి. అయినా వాడేం చెయ్యగలడు? వాడొక పశువు. ఎద్దు మొద్దు స్వరూపమే కాదు అక్షరాలా ఎద్దు.

అంతకు ముందే పెద్దన్నయ్య సాంబుడు నిలబడి ఉన్నాడు.

''అన్నయ్యా, నాన్నను పిల్చుకువస్తారా.''

''ఎట్లా?''

''పారిపోయి..''

''పిచ్చివేషాలు వెయ్యకు. నాన్న మంచివాడు కాడు. అనవసరంగా చిక్కుల్లో పడతావు.'' సాంబుడు మందలించాడు.

మౌనంగా తనుకూడా నిలబడ్డాడు. కమతగాడు బండిపోలు ఎత్తాడు. గత్యంతరంలేక వాడి మెడమీద



నింగి నీడలు

ఫోటో—ఎమ్. అప్పారావు (రాజమండ్రి-2)

పెట్టుకున్నారు రాముడు, సాంబుడు.

''అమ్మ అట్లా చావుబతుకుల్లో ఉంటే ఇప్పుడు కూడా మనకు ఇదేం చాకిరీరా, అన్నయ్యా!'' బాధగా అన్నాడు రాముడు.

సమాధానంగా కన్నీళ్ళు పెట్టుకున్నాడు సాంబుడు. దున్నపోతుల్లాగా ఉన్న ఈ మనుషులకు మన బాధలు, భాష అర్థమవుతాయంటావా?''

మౌనంగా నవ్వాడు సాంబుడు. మనస్సుల్లో దిగులు వేగాన్ని తగ్గించింది. పైవాడు కొరడాతో కసిగా కొట్టాడు. మన బతుకులు ఇంతేలే అనుకుని వేగం పారించారు.

''పశువుల డాక్టరుగారిల్లు ఎక్కడ, వెంకన్నా?'' పెద్ద కమతగాడు అడిగాడు ఎవరినో.

''చెరువుగట్టునాడ. ఏంటి విశేషం?''

''పంతులుగారి ఎద్దావు నొప్పులు పడుతూందిరా.''

అంతే! రాముడికీ, సాంబుడికి గుండె లదిరాయి, తాము వెళ్ళేది అమ్మ ప్రాణం నిలిపేందుకని ముందే తెలిసిఉంటే ఆఘమేఘాలమీద వెళ్ళేవాళ్ళంగా! అంతే! ఒక్క నిమిషం ఆలస్యం చెయ్యలేదు. ఉరుకులు పరుగులమీద వెంటనే డాక్టరు ఇంటిముందు ఆగారు.

''ఎన్నో ఈత?''

''ఆరోది, బాబూ!''

రెండు నిమిషాలు ఆలోచించాడు డాక్టరు.

''మొన్న నాలుగు బళ్ళ ఇసక తోలమంటే నిరాకాడు మీ పంతులు. ఇవాళ కావలిసివచ్చాను నేను.''

డాక్టరు మనస్తత్వానికి ఒళ్ళు మండిపోయింది. కుమ్మి చీరేదామనిపించింది రాముడికి. ఉద్రేకం చంపుకోవడంవినా గత్యంతరం లేదు. మరి డాక్టరుతో అవసరం అటువంటిది. ఏకళన ఉన్నాడో ఏమో ఒక్క నిమిషం ఆలోచించి బయలుదేరాడు డాక్టరు. రాముడు, సాంబుడు ఉరుకులు పరుగులు తీశారు.

పంతులుకు అయిదు ఎడ్లు. వరసగా సాంబుడు, బసవడు, లింగడు, జగ్గడు — చివరవాడు రాముడు. పట్టుమని పాడిఇచ్చే పాడిఆవులు ముచ్చటగా మూడైనా లేవు. అందరు మొగవెధవలే. తనకు అందరు ఆడపిల్లలే అయినట్లుగా. అందులో నాలుగోవాడు జగ్గడు. వాడు మరీ చెప్పినమాట వినకుండాపోతూంటే భరించలేక అచ్చుపోసి వదిలేశాడు. మూడు రోజులు కంటికి మింటికి ఏకధారగా ఏడ్చింది వాడిని కన్న లక్ష్మి.

వింత ఏమిటంటే ఏ పశువునైనా ఏమైనా అనేవాడుకాని లక్ష్మిమీదమాత్రం ఈగ వాలనిచ్చేవాడు కాదు పంతులు. ముద్దుగా ''లక్ష్మి'' అని పిలిచేవాడు. ఆయన దగ్గిరికి రాగానే ఉత్సాహంతో గంతులు వేసేది. ఆయన వీపు నిమరగానే బాధలన్నీ పోయి, హాయి అనిపించేది. ఆయనను చూడగానే వాత్సల్యంతో చేపు వచ్చేది లక్ష్మికి. పంతులుకుకూడా లక్ష్మిఅంటే అంతే మమకారం. తల్లిదగ్గిర పాలు తాగినట్లుగానే కలియపడి లక్ష్మిదగ్గిర పాలు తాగేవాడు.

''మనం మగవాళ్ళుగా పుట్టి తెగ తింటున్నాముకాని పుణికెడు పాలైనా ఇవ్వమని ఆయనకు కసిరా.'' రాము డన్నాడు ఒకరోజు.

''ఇవ్వాళ అమ్మను ఇంత ప్రేమగా చూస్తున్నాడు. మరి గంగిగోవులాగా పాడినిస్తున్నది కదూ! రేపు వట్టిపోయి ముసలిదైతే కసిరికొడతాడురా. అప్పుడు చూడతేం అమ్మ బాధలు.''

బండి మంచి వేగంగా పరిగెత్తుతూంది.

"మా మంచి ఆవు, బాబూ! దాని బాధ చూడలేక పోతున్నాను." జాలిగా అన్నాడు కమతగాడు.

"ఎలపట ఎద్దు ఎక్కడిదిరా?" ముచ్చటపడి అడిగాడు డాక్టరు.

"ఆ లచిమిదే, బాబూ, ఈ సంతు. మా లావు ఎద్దులెండి. దీని పేరు సాంబుడు. అసలు లచిమికి పుట్టినయన్నీ జమాజెట్టీల్లాంటి ఎడ్లే!" పొగుడుకు పోతున్నాడు.

వింటున్న సాంబుడికి ఒళ్ళు పొంగిపోయింది. గతమంతా కళ్ళముందు తిరిగింది. ఎడ్లపందాల్లో తనకు ఫస్టు ప్రయిజు వచ్చినప్పుడు తల్లి ఎంతో సంతోషించింది. నిజానికి ఆ రోజు తలుచుకుంటే ఎంతో ఉత్సాహంగా ఉంటుంది సాంబుడికి. కాని ఆ ఉత్సాహం ఇప్పుడు పొందలేడు. తల్లి చావుబతుకుల్లో ఉంది.

అంతలో బండిని నలుగురు ఆపారు. యమకింకరుల్లాగా ఉన్నారు. చేతుల్లో కర్రలున్నాయి. చూస్తూ ఉండగానే ఆ నలుగురు కలియబడ్డారు. కమతగాడు, డాక్టర్లు చావుదెబ్బలు తింటున్నారు.

పెద్ద కమతగాడు దెబ్బలు తింటూఉంటే సాంబుడికి, రాముడికీ ఒకపక్క సరదాగా ఉంది. కాని సందర్భం ప్రమాదంగా ఉంది. చూడలేకపోయారు. విరుచుకు పడ్డారు. సాంబుడు ప్రళయరుద్రుడి రూపం దాల్చాడు. పదినిమిషాలు యుద్ధరంగమైంది. ఆ నలుగురు పారిపోయారు. కమతగాడిని, డాక్టరును రక్షించిన ఘనత ముఖ్యంగా సాంబుడిది. బండి కట్టుకుని కదిలారు.

"ఏదో పురుగు ముట్టిందిరా, తమ్ముడూ!" నగరుస్తూ అన్నాడు సాంబుడు.

"ఎట్లా ఇప్పుడు?" కంగారుగా అన్నాడు.

"అమ్మ సంగతి చూడాలిరా. ఎట్లాగైనా ఇంటికి చేరితేచాలు ఇప్పుడు." నురుగులు నోటివెంట వస్తున్నా బలంగానే పరిగెత్తాడు రాముడితో సమంగా.

రాముడికి ఏడుపు వచ్చింది. కాని ఎట్లా ఏడవడం? ఇంటికి చేరేసరికి అంతా ప్రశాంతంగా ఉంది. ఆ నిశ్శబ్దాన్ని చూడగానే భయంవేసింది రాముడికి, సాంబుడికి.

యుద్ధంచేసి గుడారాలకు తిరిగివచ్చిన సైనికుల మాదిరిగా ఉన్నారు.

"ఈసారికూడా మొగవెధవే పుట్టాడు, డాక్టరుగారూ! పాడిఇచ్చే లక్ష్మిలాటి పిల్ల పుట్టలేదు కదా!" నిరుత్సాహంతోనే అన్నాడు పంతులు. అలుముకున్న విషాదానికి కారణం అర్థమైంది. ఎంత స్వార్థపరులు మనుషులు!

"పరవాలేదు లెండి. మీకు ఉన్న వ్యవసాయానికి ఎద్దుకూడా కావలిసిందేగా!" ఆయాసంతో అన్నాడు డాక్టరు.

"అదేమిటి, అట్లా రొప్పుతున్నారు?" కంగారుగా అడిగాడు పంతులు.

రాముడికి ఒకపక్క ఆనందం, తమ్ముడు పుట్టాడు. మరోపక్క విషాదం. అన్నయ్యను పాము కరిచింది. ఈ విషాదవిభ్రమాలలో వాళ్ళు ఏం చెప్పుకుంటున్నారో వినపడలేదు రాముడికి. బావురుమని ఏడిచాడు.

"ఎందుకలా ఏడుస్తావు?" నురుగులు కక్కుతూ అన్నాడు సాంబుడు.

"నన్ను అన్యాయం చేస్తున్నావా, అన్నయ్యా!" భరించలేకపోయాడు రాముడు.




మన అబ్బాయి రాత్రింబవళ్ళు కష్టపడి చదువుతున్నాడు. ఈ సంవత్సరం యూనివర్సిటీ ఫస్టు రావటం ఖాయం!!

(చిత్రం — వి. కోటేశ్వర్ (హైదరాబాద్-20)

"చచ్చిపోయినవాళ్ళను గురించి, నావంటి వాళ్ళను గురించి ఏడవకూడదురా. బతికిఉన్నవాళ్ళని ప్రేమించాలి. జాలిపడాలిరా. తమ్ముడిని ప్రేమతో చూడరా." ఓదార్చాడు సాంబుడు.

"సాంబుడికి ఏదో అయింది, అయ్యా." రొప్పుతూనే కంగారుగా అన్నాడు కమతగాడు. ఆ తరవాత ఎన్ని గంటలు ప్రయత్నం చేసినా సాంబుడి ప్రాణం దక్కలేదు. పంతులు ఇంటి గొడ్లసావిడితో ఋణం తీరిపోయింది. లోగిలి అంతా చీకటి. మాట్లాడలేని రాముడి మనస్సులో పేరుకుపోయిన దుఃఖం ఎవ్వరికీ తెలియదు. సావిడిలో కట్టుకొయ్య బోసిపోయింది. వెలితి. ఎక్కడ చూసినా వెలితి. వదలలేని ప్రగాఢమైన అనుబంధాన్ని పెంచి ప్రమాదంలో మరణించిన అన్నయ్య. . . తట్టుకోలేకపోయాడు రాముడు. కంటికి మెరుపు లేదు. నోటికి మేత లేదు. అణచుకోలేని దుఃఖం. అది తీరేది కాదు. కొంతకాలంవరకు ఏ పనికి రాకుండా పోయాడు రాముడు. తన కెందరో ఉన్నా ఎవరూ లేనట్లు ఒంటరితనంతో బాధపడేవాడు. కమతగాడు, యజమాని మనుషులు. అందుకే సాంబుడిని సులభంగా మరిచిపోయారు. మరవలేనిది! లక్ష్మి. గంగిగోవులా పాలిచ్చే లక్ష్మి అప్పటినుంచి వట్టిపోయింది. ముసలితనం ఎరగని లక్ష్మి అప్పటినించి ముసలిదైపోయింది.

ఇదంతా లక్ష్మడు పుట్టకముందు.

ఇప్పుడు సాంబుడు ఖాళీచేసినచోటు లక్ష్మడు భర్తీ చేశాడు. కాని ఆ అభిమానాన్ని పొందలేకపోతున్నాడు. దానికి చాలా కారణాలు ఉన్నాయి. వాడు పుట్టిననక్షత్రం మంచిదికాదు. అందుకనే సాంబుడు చచ్చిపోయాడు. నిజానికి అప్పటినుంచే పంతులు ఇంటి స్థితిగతులు మారాయి. ఒక్కొక్క గొడ్డు పుట్టిన వేళావిశేషం అటువంటిదని పంతులు నమ్మకం. ఎన్నడూలేని దరిద్రం అగుపిస్తూంది తమకు పెట్టే మేతలో. ఉన్నది పుష్టి మనుషులకు. తిన్నది పుష్టి పశువులకు. ఆ పుష్టి లేకపోతే సంతుష్టుండదు. అందుకుతగినట్లుగా లక్ష్మడిది ఒక వింత ప్రకృతి. ఎప్పుడూ ఒక వేదాంతిగా ఉంటాడు. వాడిమాటలుకూడా అట్లానే ఉంటాయి.

లక్ష్మడు బాధగా మూలిగాడు.


"ఊరుకోరా, తమ్ముడూ. నీ మూలుగు వింటే అమ్మ మరింత బాధపడుతుంది." ఆర్ద్రంగా అన్నాడు.

"అది కాదురా, అన్నయ్యా, అమ్మకు మేత తిన్నగా పెట్టడంలేదురా. పాలు ఇచ్చినంతకాలం పీల్చి పిప్పిచేసి తెగ సంపాదించాడు పంతులు. ఇప్పుడు చూడు. అమ్మ చిక్కిపోయింది. ముసలితనంలో దరిద్రం దుర్భరం కదూ!" కన్నీళ్ళు పెట్టుకుని లక్ష్మివంక చూస్తూ అన్నాడు లక్ష్మడు.

"నీ వంట్లో ఎట్లా ఉందిరా?" రాముడి ప్రశ్న.

"ఎట్లాఉంటే ఏముందిలే? నా కెందుకో ఇక్కడ ఉండ బుద్ధి పుట్టడంలేదురా. పారిపోదామని ఉంది. అయినా అమ్మకోసం ఉంటున్నానురా, అన్నయ్యా!"

"వెధవ్వేషాలు వెయ్యకు. నీ నిలకడలేనితనంవల్ల ఎన్ని గొడవలు వస్తున్నాయో తెలుసా? ఊరంతా ముఠా రాజకీయాలతో మాడిపోతూంది. మొన్నటికి మొన్న ఊరికే ఉండకుండా మునసబుగారి చేలో పడ్డావు. అది కొట్లాటకు దారితీసింది. ఫలితంగా నువ్వెన్ని తన్నులు తిన్నావు? ముసలితనంలో అమ్మని ఎందుకు దిగులు



తీరుబడి

ఫోటో—ఎస్. షా ఆలీ (హైదరాబాదు)

పెడలావురా? నీ పద్ధతి మారాలి." రాముడు మందలించాడు.

పంతులు రుసరుసలాడుతూ వచ్చి ఇంకో కొరడా దెబ్బ వేశాడు.

"ఛీ! ఛీ! దీన్ని తగలెయ్యా. పోతులాగా తినడం ఎక్కువైంది. ఎవరి చేలో పడితే ఎవరు ఊరుకుంటారు." చరచర్లాడుతూ గడ్డి పోగు చేశాడు. తన మాటలు వాటికి తెలుస్తాయని కాబోలు మనుషులతో మాట్లాడుతున్నట్లే మాట్లాడతాడు ఆయన గొడ్లతో.

"మళ్ళీ కొంపమీదకు ఏం తెచ్చావురా?" బాధగా అన్నాడు రాముడు.

"ఏమీలేదురా, అన్నయ్యా. రాత్రి ఆకలివేసింది. కట్లు తెంచుకుని మునసబుగారి తోటలో పడ్డాను. తిన్నంత తిని వీలైనంత కొమ్ములమీద తెచ్చాను. ఇందాక నువ్వు తిన్నది అదే." సిగ్గుతో తల వంచుకుని అన్నాడు.

"జబ్బుతో ఉన్న అమ్మ వింటే ఎంత బాధపడుతుందో తెలుసునా? మన ఇంటా వంటాలేని పనులు చేస్తున్నావురా." మందలించాడు రాముడు.

నాలుగేళ్ళనాడు సరిగా లక్ష్మడు పుట్టబోయే ముందు పడిన మరణవేదన తిరిగి అనుభవిస్తూంది లక్ష్మి. జీవితం అంటే ప్రతి క్షణం మరణమే అనుకునే రాముడు తల్లిబాధ చూడలేకపోయాడు. అయినా బ్రతుకుకు ఒక అర్థం లంటూ ఆపాదించేది మరణమే కనక జీవిత పరమార్థాన్ని దృష్టిలో ఉంచుకుని జీవించే రాముడికి చావు అసహజం అనిపించలేదు.

"అమ్మ త్వరగా చచ్చిపోతే మంచిదిరా." నిర్వేదంగా అన్నాడు రాముడు.

"అదేమిట్రా, మేత పెట్టలేని పంతులు అన్నట్లే అంటున్నావు?" కన్నీళ్ళు కార్చుతూ అన్నాడు.

"ముసలితనంలో గొడ్డు బ్రతుకుకు అర్థంలేదురా, తమ్ముడూ!"

ఆరు ఈతలు ఈనిన లక్ష్మి, నిస్వార్థంగా తన సర్వస్వం యజమానికి అర్పించిన పుడమితల్లివంటి లక్ష్మి, అన్నీ వట్టిపోయి, అంతా ఈడ్చుకుపోయి ముదుసలి లక్ష్మి అవసానంలో వెర్రిఅరుపు అరిచింది.

బ్రతికినంతకాలం వసంతాభ్యుదయంతోనే జీవించాలనే లక్ష్మడికీ మరణం దారుణంగాను, విలక్షణంగాను అనిపించింది. జీవనరాగంలో మరణం అపశ్రుతిగా భావించే లక్ష్మడు అమ్మ పెట్టిన గావుకేకకు తల్లడిల్లిపోయాడు.

ఎట్లా బ్రతుకుతారో ఏమో అన్నట్లుగా పిల్లల వంక బరువుగా చూసింది లక్ష్మి. కృతజ్ఞతగా పంతులుకు నమస్కరించినట్లు మోర వంచింది.

"లక్ష్మికి పిల్లలమీద బెంగల్లే ఉందిరా. వాటికట్లు ఊడదీయండి."

బసవడు, లింగడు, రాముడు, లక్ష్మడు అందరు ఒక్కసారిగా తల్లి దగ్గిరికి చేరారు. భాషలో పలుకలేని భావంతో అమ్మ ఒళ్ళంతా స్పృశించారు.

"యజమాని అంటే నమ్రతగా ఉండండి. పొద్దు గుంకగానే ఇంటికి రండి. పురుగు పుట్ర ఉంటాయి. ఇతరుల పొలాల్లో మేత తిని కడుపు నింపుకోవాలని అనుకోకండి." అంతే! లక్ష్మి అంతిమసందేశం అదే. ముసలి లక్ష్మి ప్రాణం వదిలింది.

చివరికి మిగిలిన ఏడుపు హాయిగా ఏడిచేశారు అన్నదమ్ములందరూ. చూస్తూ ఉండగానే లక్ష్మిని పసుపు కుంకుమలతో అలంకరించారు. మెళ్లో పూలదండ వేశారు. బండిలో ఎక్కించారు. బండిలో ఒకమూల నాలుగు బస్తాల ఉప్పు ఉంది.

అందరికి కడుపులో కడివెడు దుఃఖం.

గొడ్లు మనుషులలా ఏడిచాయి.

మనుషులు గొడ్లలా ఏడిచారు.

కొడుకులై పుట్టినందుకు ఆమె శవాన్ని మోసింది రాముడు, లక్ష్మడు.

పెద్దకమతగాడు కొరడాతో రాముడిని, లక్ష్మడిని అదిలించాడు.

మూగగా ఒకళ్ళని ఒకళ్ళు చూసుకుని కన్నీళ్ళు పెట్టుకుని కదిలారు రాముడు, లక్ష్మడు.

'ఈ అదృష్టం నాకు ఉండదు' అనుకున్నది ముసలి పంతులు తల్లి.

తనకు భార్య ఉండి ఏదో అహంకారం, మదంవలస లేనట్లుగా భావించే భర్త, ఆమె మరణించిన తరవాత అలౌకికమైన బాధ ఒక్కటి మనస్సులో మెలిపెట్టినట్లుగా ఊరవతల మర్రిచెట్టునీడలో నిలబడ్డ ఒక అంబోతు లక్ష్మి శవాన్ని చూసి ఒక్క క్షణంపాటు మనిషిగా మారింది.

★